ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





రామకుప్పం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలోని నక్షత్ర వనంలో పార్వతీ, పరమేశ్వరుల వద్ద , వనాల్లో కార్తీక దీపాల వెలుగులు



ఆధ్యాత్మిక శోభితం..కార్తీకమాసం

● నేడు కార్తీక పౌర్ణమి

పుంగనూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస సందర్భంగా శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగు తున్నాయి. గత నెల 22వ తేది ఈ మాసం ప్రారంభమైంది.ఈ నెలలో సోమవారాలకు, పౌర్ణమికి భక్తులు ప్రాధాన్యత ఇస్తుంటారు.పూజలు, ఉపవాసాలు, వ్రతాలు, వనభోజనాలు, దీపోత్సవాలతో భక్తిపారవశ్యంలో మునిగిపోతుంటారు.ఈ మాసంలో వచ్చే కార్తీకపౌర్ణమి బుధవారం కావడంతో శైవక్షేత్రాలు దీపోత్సవాలకు ముస్తాబవుతున్నాయి.ఆలయాల ధ్వజస్తంబాలు, గోపురాలు, ద్వారాలు, శివలింగం ముందు, విష్ణువిగ్రహం వద్ద, తులసిచెట్టు, ఇంటిప్రధాన ద్వారం ముందు కార్తీక మాసంలో దీపాలు వెలిగిస్తే పుణ్యఫలం లభిస్తుందని భక్తుల నమ్మకం. ఆవునెయ్యితో దీపాలు వెలిగించి అరటిదొప్పల్లో పెట్టి కోనేరుల్లో, వంకల్లో, నదుల్లో వదులుతుంటారు.

బాలల దినోత్సవాన పరీక్షా?!

వెదురుకుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల పదవ తేది నుంచి ప్రారంభం కానున్న సమ్మేటివ్-1 పరీక్షలు బాలల దినోత్సవానికి పరీక్షలా మారాయి.రాష్ట్ర ప్రభుత్వం సమ్మేటివ్ అసెస్మెంట్-1 కోసం నిర్దేశించిన టైంటేబుల్‌లో నవంబరు 14వ తేదిన ఆరవ తరగతినుంచి పదో తరగతి విద్యార్థులకు ఆంగ్ల పరీక్ష, ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు గణిత పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రచురించారు.పిల్లలకు ఆటల పోటీలు, వ్యాస రచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల స్థానంలో సమ్మేటివ్ పరీక్షలు జరగనున్నాయి. ప్రభుత్వం పునరాలోచించి బాలల దినోత్సవం రోజున పరీక్షలను వాయిదా వేస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

స్వయం ఉపాధి పథకాలపై నేడు సదస్సు

చిత్తూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల యువతీ, యువకులకు స్వయం ఉపాధి పథకాలపై బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ మీటింగ్ హాలులో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విక్రమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో బ్యాంకు రుణ సదుపాయాలు, పథక వివరాలను వివరించడం, నిపుణుల నుంచి అనుభవాలను తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలోని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చాట్‌బాట్‌తో 315 మొబైల్ ఫోన్ల రికవరీ

చిత్తూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బస్టాండు, రైల్వేస్టేషన్‌లో చోరీలకు గురవడం లేదా ఎక్కడైనా పోగొట్టుకున్న 315 మొబైల్ ఫోన్లను చాట్‌బాట్ ద్వారా పోలీసులు రికవరీ చేశారు. వీటిని జిల్లా పోలీసు అతిథి గృహంలోని కాన్ఫరెన్స్ హాలులో బాధితులకు మంగళవారం అందించారు. ఆ వివరాలను ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీ సాయినాథ్, క్రైమ్ సీఐ ఉమామహేశ్వరరావు, ఒకటో పట్టణ సీఐ మహేశ్వరతో కలిసి ఎస్పీ తుషార్ మీడియాకు తెలియజేశారు. జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట ఫోన్లు దొంగతనాలకు గురవడం, పోగొట్టుకోవడం వంటివి జరుగుతూనే ఉంటాయి. ఇటువంటి వారు పడే ఇబ్బందులను గుర్తించిన పోలీసుశాఖ చాట్‌బాట్‌ను ప్రవేశపెట్టింది. దీనిద్వారా తొలిదశలో కోటి విలువ చేసే 500 ఫోన్లు, రెండో దశలో 45లక్షల విలువైన 200 ఫోన్లు, మూడో దశలో 60లక్షల విలువైన 300 ఫోన్లు, నాల్గవ దశలో 45లక్షల విలువైన 200 ఫోన్లు, ఐదో దశలో 65 లక్షల విలువైన 300 ఫోన్లు, ఆరో దశలో 45 లక్షల విలువైన 200 ఫోన్లు, ఏడో దశలో 70 లక్షల విలువైన 330 ఫోన్లు, ఎనిమిదో దశలో 66లక్షల విలువైన 305 ఫోన్లు, తొమ్మిదో దశలో 65 లక్షల విలువైన 300 ఫోన్లు, పదో దశలో 90 లక్షల విలువైన 450 ఫోన్లు, 11వ దశలో 91లక్షల విలువైన 456 ఫోన్లు, 12వ దశలో 50 లక్షల విలువైన 120 ఫోన్లు, తాజాగా 13వ దశలో 63లక్షల విలువైన 315 ఫోన్లను రికవరీ చేశారు. మొత్తం 13 దశల్లో 8.55 కోట్ల విలువైన 4,106 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు.

ఇతర రాష్ట్రాల వారికీ సేవలు

జిల్లావాసులకే కాకుండా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్రలకు చెందిన వారికి కూడా చాట్‌బాట్ కింద సేవలు అందుతున్నాయి. ఇతర రాష్ట్రాల వారు మన జిల్లాలో పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేసి బాధితుల చిరునామాకు పంపుతున్నామని ఎస్పీ తెలిపారు.

చాట్‌బాట్‌లో నమోదు ఇలా..

మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నవారు 94409 00004 వాట్సాప్ నెంబరుకు హాయ్ లేదా హెల్ప్ అని పంపాలి. తర్వాత వెల్‌కం టూ చిత్తూరు పోలీసు పేరున ఒక లింకు వస్తుంది. అందులో గూగుల్ ఫార్మేట్ ఓపెన్ అవుతుంది. అందులో జిల్లా పేరు, వయస్సు, తండ్రి పేరు, చిరునామా, కాంటాక్టు నెంబరు, మిస్సయిన మొబైల్ నెంబరు, ఐఎంఈఐ నెంబరు, మిస్ అయిన ప్లేస్ వంటివి పూరించి.. సబ్మిట్ చేయాలి. వెంటనే కంప్లయింట్ నమోదవుతుంది. ఆ తర్వాత పోలీసు ట్రాకింగ్ సిస్టం ద్వారా ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగిస్తారు.



రికవరీ చేసిన మొబైల్ ఫోన్లు, బాధితులతో ఎస్పీ తుషార్, ఇతర అధికారులు

స్వచ్ఛ పుంగనూరే లక్ష్యం

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం



మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న పట్టాభిరాం, చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పుంగనూరును స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దడమే కాకుండా సీఎం చంద్రబాబు సహకారంతో అభివృద్ధి చేసి చూపుతామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె. పట్టాభిరాం అన్నారు. పుంగనూరులో మంగళవారం పర్యటించిన ఆయన మున్సిపల్ కంపోస్ట్‌యార్డును, ఇందిరా సర్కిల్‌లో కౌండిన్య నది ఆక్రమణలను పరిశీలించారు.పారిశుధ్య నిర్వహణపై మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరులో రోజూ 13.5 టన్నుల చెత్తను డంప్ చేయకుండా ఏ రోజు చెత్త ఆ రోజే ప్రాసెస్ చేసేలా పుంగనూరు-పలమనేరు మార్గంలో వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్‌ను మూడు నెలల్లో ఏర్పాటు చేస్తామని చెప్పారు. చెత్తసేకరణకు 10 ఆధునిక ఎలక్ట్రికల్ చెత్త ట్రక్కు వాహనాలు, మరో 10 ఎలక్ట్రిక్ కంప్యాక్టు వాహనాలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పట్టణ నడిబొడ్డున ప్రవహిస్తున్న కౌండిన్యనది కాలువ ఆక్రమణలను అరికట్టాల్సిన నాయకులే చేసిన కబ్జాలతో వర్షపు నీరు రోడ్లు, ఇళ్లలోకి వెళుతున్నా పట్టించుకోకుండా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు.ఈ సమస్యను మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. పుంగమ్మ చెరువుకట్ట సుందరీకరణతో పాటు కౌండిన్యనది వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా శాశ్వత పనులు చేపడతామన్నారు. పుంగనూరు సమస్యలను టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారని, వాటిని సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళతానని చెప్పారు. టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే పుంగనూరు మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నట్లు తెలిపారు. చిత్తూరు, పుంగనూరు మున్సిపల్ కమిషనర్లు నరసింహప్రసాద్ రెడ్డి, మధుసూదన రెడ్డి, తహసీల్దార్ జె.రాము, మార్కెట్ కమిటీ చైర్మన్ శమిపతి, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీ రెడ్డి, ఎం.శ్రీకాంత్, పోలీసుగిరి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న రఘురామన్

చిత్తూరు కానిస్టేబుల్‌కు జాతీయస్థాయి గుర్తింపు

చిత్తూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరుకు చెందిన కానిస్టేబుల్ రఘురామన్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్‌లో జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. ఢిల్లీలో ఇటీవల నేషనల్ పోలీసు గ్రూప్ ఆధ్వర్యంలో ఆలిండియా క్రైమ్ మీటింగ్ జరిగింది.దేశవ్యాప్తంగా క్రైమ్ ఇన్వెస్టిగేషన్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన సిబ్బందిని సన్మానించి.. ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రం నుంచి మొత్తం 26మంది పాల్గొనగా.. వీరిలో చిత్తూరులో క్రైమ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రఘురామన్ ఉన్నారు. ఈయనకు ఢిల్లీ డీజీపీ ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. అరుదైన గౌరవాన్ని తీసుకొచ్చిన రఘురామన్‌ను ఎస్పీ తుషార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈయన సేవలు ఇతర సిబ్బందికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

వైద్య సేవలెలా అందుతున్నాయి?

చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులతో మాట్లాడుతున్న డాక్టర్ జోయా అలీ రిజ్వీ



● సెంట్రల్ టీం సభ్యుల ఆరా ● చిత్తూరు ఆస్పత్రి, గుడిపాల పీహెచ్‌సీల పరిశీలన ● హాజరుకాని డీఎంహెచ్‌వో



జిల్లా బాలల ముందస్తు చికిత్సా కేంద్రంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కేంద్రబృంద సభ్యులు

చిత్తూరు రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో పరిస్థితిని పరిశీలించడానికి వచ్చిన కేంద్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కామన్ రివ్యూ మిషన్ బృందం మంగళవారం చిత్తూరులో, గుడిపాలలో పర్యటించింది. ముందుగా కలెక్టరేట్‌లో సమావేశమైన బృంద సభ్యులకు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో అందిస్తున్న వైద్య సేవలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డాక్టర్ జోయా అలీ రిజ్వీ నేతృత్వంలోని ఈ 12మంది సభ్యుల బృందం తరువాత చిత్తూరు ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించింది.ఎంసీహెచ్ వార్డులో గర్భిణులను జోయా అలీ రిజ్వీ పలకరించారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యంపై ఆరా తీశారు. టీకాలు, కాన్పు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓపీ, టీబీ వార్డు, ఏఆర్‌టీ కేంద్రం, లెప్రసీ వార్డులను ఆమె తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుడిపాల పీహెచ్‌సీని, వసంతాపురం హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలను పరిశీలించారు. అక్కడున్న ఆశా వర్కర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ యాప్‌ల నుంచి తమకు విముక్తి కల్పించాలని ఆమెను ఆశాలు కోరారు.

పీహెచ్‌సీ వైద్యాధికారులకు శిక్షణ అవసరం

జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యాధికారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ కార్యక్రమాలపై అవగాహన లేనట్టు తెలుస్తోందని స్టేట్ టీం సభ్యురాలు నిర్మల అన్నారు.వీరందరికి మరింత శిక్షణ ఇవ్వాలని అధికారులను ఆదేశిస్తామని తెలిపారు. సెంట్రల్ టీం పర్యటనకు డీఎంహెచ్‌వో సుధారాణి హాజరు కాకపోవడంతో జూనియర్లయిన ప్రోగ్రామ్ అధికారులు వారివెంట ఉన్నారు.దీనిపై టీం సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. కేంద్ర బృందం బుధవారం కుప్పం నియోజకవర్గంలో పర్యటించనుండడంతో అక్కడున్న పీహెచ్‌సీ, వైద్య కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. అందరు విధుల్లోనే ఉండేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీఐవో హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకలితో అలమటించిన విద్యార్థినులు

కేంద్ర బృందం పర్యటనకు వస్తోందని ఆర్‌బీఎస్కే అధికారులు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నిర్వహిస్తున్న 'జిల్లా బాలల ముందస్తు చికిత్సా కేంద్రం'లో ఎస్సీ హాస్టల్‌కు చెందిన విద్యార్థినులను తీసుకొచ్చారు. ఉదయం 9 గంటలకు వచ్చిన వారంతా మధ్యాహ్నం 1.30 వరకు వేచివుండాల్సిరావడంతో ఆకలితో అలమటించారు. చివరకు కేంద్ర బృందం వెళ్లాక వారికి మందులు ఇచ్చి పంపారు.

వరసిద్ధుడికి నేడు అన్నాభిషేకం

● ఆర్జిత సేవల రద్దు

ఐరాల(కాణిపాకం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం వరసిద్ధుడికి అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కాణిపాకానికి చెందిన దివంగత నల్లా సుబ్బరాయులుశెట్టి జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఉభయదారులుగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆలయంలో నిర్వహించే అన్ని ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు ఈవో పేర్కొన్నారు. జిల్లాలోని స్వామి భక్తులు, ఆలయ ఉభయదారులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని ఈవో కోరారు.

ప్రేమ విఫలమై విద్యార్థి ఆత్మహత్య



మృతి చెందిన రుద్ర

చిత్తూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగర శివారులో ఉన్న ఓ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు రోజుల క్రితం ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేయగా.. మంగళవారం మరో విద్యార్థి మిద్దెపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు కొంగారెడ్డిపల్లెలోని సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన రుద్ర.. బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కొంతకాలంగా కళాశాలలోని సహచర విద్యార్థినిపై పెంచుకున్న ప్రేమను వ్యక్తం చేయగా ఆమె తిరస్కరిస్తూ వస్తోంది. మంగళవారం కూడా ప్రస్తావించగా, ఆమె తిరస్కరించడంతో మనస్తాపానికి గురై కళాశాల మూడో అంతస్తు నుంచి దూకేశాడు. గాయాలపాలైన రుద్రను కళాశాల యాజమాన్యం వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. కాగా, రుద్ర మృతిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ నిత్యబాబు తెలిపారు.



పేడ దిబ్బలో పురిటిబిడ్డ !

సోమల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):ఏ తల్లి కన్నబిడ్డో....ఓ పురిటి బిడ్డ పేడదిబ్బల నడుమ పడివుండడం సోమల మండలం నడింపల్లె పంచాయతీలో మంగళవారం ఉదయం వెలుగుచూసింది. ఎర్రంవారిపల్లెకు చెందిన సులోచనకు ఇంటి సమీపంలో ఓ శిశువు ఏడుపు పదేపదే వినపడింది. వెతుక్కుంటూ వెళ్లగా పేడదిబ్బల మధ్య ముళ్ల పొదల్లో పడివున్న శిశువు కన్పించింది.వెంటనే ఆ బిడ్డను ఇంటికి తీసుకొచ్చిన సులోచన అంగన్‌వాడీ కార్యకర్త నాగరత్నకు సమాచారమిచ్చింది.సోమల వైద్యశాలకు ఆ ఆడబిడ్డను తీసుకెళ్లి పరీక్షలు చేయించారు. సోమల వైద్యాధికారి డాక్టర్ జయసింహ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హరిత కలసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో ఆ శిశువును పోలీసుల సహకారంతో చిత్తూరు శిశువిహార్‌లో చేర్పించారు.

8న పవన్‌కల్యాణ్ పర్యటన

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రెండు రోజుల పర్యటనకు శుక్రవారం రానున్నారు. ఉదయం 10గంటలకు రేణిగుంట మండలం మామండూరు అటవీక్షేత్రాన్ని.. మంగళం వద్దనున్న ఎర్రచందనం గోదామును పరిశీలించి హోటల్ తాజ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 3గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుని ఎర్రచందనం పరిరక్షణ, స్మగ్లింగ్‌ను అరికట్టడం వంటి అంశాలపై పోలీసు, అటవీ, రెడ్‌శాండిల్ టాస్క్‌ఫోర్సు అధికారులతో సమీక్షిస్తారు. శనివారం ఉదయం పలమనేరు చేరుకుని కుంకీ ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. ఏనుగుల వల్ల నష్టపోయిన రైతులు, అటవీశాఖ అధికారులతో సమావేశమవుతారు. అదే రోజు తిరుపతికి చేరుకుని విజయవాడకు తిరుగు ప్రయాణమవుతారు.

శ్రీవారి విరాళంగా వెండి గంగాళం



తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి మంగళవారం వెండి గంగాళం విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన జక్కారెడ్డి శ్రీనివాసులురెడ్డి అనే భక్తుడు 22 కేజీల బరువున్న రూ.30 లక్షల విలువైన గంగాళాన్ని టీటీడీ అధికారులకు అందజేశారు. అంతకుముందు అదనపు ఈవో వెంకయ్య చౌదరిని ఆయన కలిసి వివరించారు.



తిరుపతి శ్రీకాలేజీ స్థానంలో యూనివర్శిటీ

● తెలంగాణ ఎమ్మెల్యే మల్లారెడ్డి

తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శ్రీకాలేజీని కొనుగోలు చేశానని, ఈస్థానంలో యూనివర్శిటీ పెట్టాలనే కోరికతో తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శించుకుని మొక్కుకున్నట్టు తెలంగాణ ఎమ్మెల్యే మల్లారెడ్డి తెలిపారు. తిరుమల శ్రీవారిని మంగళవారం ఉదయం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశమంతా యూనివర్శిటీలు ఏర్పాటు చేయాలనే ఆలోచనతో వైజాగ్‌లో ఇప్పటికే యూనివర్శిటీ నెలకొల్పామన్నారు. తిరుపతి శ్రీ ఇంజనీరింగ్ కాలేజీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయిందని తెలిపారు. మల్లారెడ్డి మాట్లాడుతుండగా కొందరు 'జై తెలంగాణ' అంటూ నినాదాలు చేశారు.

నేడు కార్తీక పున్నమి గరుడసేవ

తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం గరుడవాహనంపై శ్రీమలయప్పస్వామి దర్శనమివ్వనున్నారు. ప్రతి నెలా పౌర్ణమిరోజున టీటీడీ గరుడసేవను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. బుధవారం కార్తీక పౌర్ణమి కావడం విశేషం. రాత్రి 7 గంటలకు వాహనసేవ ప్రారంభంకానుంది.


సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 15 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.74 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,322

తలనీలాలు సమర్పించినవారు: 26 వేలు



విడిదికి వేళాయె!

వలస పక్షులకు స్వాగతం పలుకుతున్న నేలపట్టు

పెలికాన్‌లు (గూడబాతులు)



గూళ్ళు సర్దుకుంటూ



వైట్ఐబీస్(తెల్లకంకణాయి)

పుల్లలు ఏరుకుంటూ



ఓపెన్ బిల్డ్‌స్టార్క్స్(నత్తగుల్ల కొంగలు)

దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి


వలసపక్షుల విడిది కేంద్రం నేలపట్టులో సందడి మొదలైంది. వేల కిలోమీటర్ల దూరాల నుంచి ఎగురుకుంటూ వస్తున్న పక్షులకు స్వాగతం పలుకుతోంది. అక్టోబరు 20 తర్వాత పక్షుల రాక పలుచగా మొదలైనా వారం నుంచీ వీటి సంఖ్య పెరిగింది. నిజానికి అక్టోబరు మొదటి వారం నుంచే వలసవిహంగాల రాక మొదలు కావాలి. నేలపట్టు చెరువుల్లోని పచ్చని కడప చెట్ల మీద తెల్లని పత్తిపూలలా కొంగలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది వానలు బాగా కురిశాయి. చెరువులు కళకళలాడుతున్నాయి. పులికాట్ సరస్సుకూడా నీటితో నిండుగా ఉంది. దీంతో ఈ యేడాది పెలికాన్ పక్షుల సంఖ్య భారీగా ఉంటుందని అటవీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆస్ట్రేలియా, శ్రీలంక, దక్షిణాఫ్రికా దేశాల నుంచి పెలికాన్ పక్షులు నేలపట్టుకు వస్తాయి. కడప చెట్లుపై గూళ్లు అల్లుకుని, జత వెతుక్కుని, గుడ్లు పెట్టి, పొదిగి తమ సంతతి వృద్ధి చేసుకొంటాయి. నేలపట్టు చెరువుల్లోని చెట్లమీద అయిదారు నెలలపాటూ ఉండే పక్షులు, తెల్లవారగానే రెక్కలు విప్పుకుని ఇక్కడికి 10 నాటికల్ మైళ్ళ దూరంలోని పులికాట్ సరస్సులోకి వెళ్లిపోతాయి. ఈ కాలంలో చేపలూ, రొయ్యలూ పులికాట్‌లో సంవృద్ధిగా ఉంటాయి. కడుపు నిండా తిని తమ మెడకింది గూళ్లలో మత్స్యఆహారం దాచుకుని సాయంత్రానికి తిరిగి నేలపట్టుకు చేరుకుని విశ్రమిస్తాయి. ప్రస్తుతం ఎండిన పుల్లలు ఏరుకుంటూ, గూళ్లకు చేరుస్తూ, ఈదులాడుతూ, నింగిలో విన్యాసాలు చేస్తూ జతను ఆకర్షిస్తూ నేలపట్టులో సందడి చేస్తున్నాయి. నీటి అడుగు భాగంలో దొరికే పీచులాంటి గడ్డిని సేకరించి గూళ్లలో మెత్తగా పరచుకుంటున్నాయి. పక్షుల రాక ప్రారంభం కావడంతో స్థానిక వన్యప్రాణి సంరక్షణ శాఖ అధికారులు సందర్శకులను అనుమతిస్తున్నారు.



జతను ఆకర్షించే విన్యాసాలు

విడిదికి చేరుకున్న పక్షులు ఇవీ

పక్షి పేరు	2024	2025 (నవంబర్ 1 నాటికి)
పెలికాన్స్ (గూడబాతులు)	921	1026
ఒపన్ బిల్డ్ స్టార్క్స్(నత్తగుల్లకొంగలు)	1547	2384
వైట్ ఐ బీస్(తెల్లకంకణాయి)	1364	1064
లిటిల్ కార్మోరెంట్స్ (చిన్ననీటి కాకులు)	432	622
స్పూన్ బిల్స్ (తెడ్డుమూతి కొంగలు)	02	52
మొత్తం	4266	5148



పెలికాన్ జంట విహారం



పక్షుల రాక మొదలవడంతో సందర్శనకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే పక్షుల కేంద్రం లోని అన్నీ రోడ్లను శుభ్రపరిచే పనులు ప్రారంభించాం. పక్షుల సంఖ్యతో పాటు, సందర్శకుల సంఖ్య కూడ రోజు రోజుకీ పెరుగుతుంది. నేలపట్టు ఆహ్లాదకరమైన ప్రదేశం. ప్రశాంతంగా పక్షుల విన్యాసాలు వీక్షించవచ్చు.

- ఎ. సౌజన్య, నేలపట్టు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్



ప్రేమకలాపాలు



గూళ్లలో విశ్రాంతి



కడప చెట్లుపై కొలువు దీరిన వలస పక్షులు



లిటిల్ కార్మోరెంట్స్(చిన్న నీటి కాకులు)

పంచాయతీనిధుల దుర్వినియోగంపై ఇరువర్గాల ఘర్షణ

● ఇద్దరికి గాయాలు



శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చెంచుబాబు

కేవీబీపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పవనివారికండ్రిగలో పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారంటూ ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు... పవనివారికండ్రిగకు చెందిన శ్రీనివాసులు అలియాస్ వాసు గ్రామంలో పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఈనెల 3న సోమవారం చర్చించడంపై సర్పంచు వర్గానికి చెందిన చెంచుబాబు మధ్య వాగ్వాదం జరిగింది. మంగళవారం ఉదయం వాసు పెద్దమ్మ బుజ్జమ్మ తన మరిది వెంకటేశ్వర్లును ఎందుకు బెదిరించారంటూ నిలదీశారు. ఈక్రమంలో మునిరామయ్య, చెంచుబాబు, చెంచుకృష్ణ తదితరులు శ్రీనివాసులు చిన్నాన్న సుబ్రహ్మణ్యంపై దాడి చేశారు. శ్రీనివాసయాదవ్ అడ్డుపడగా అతనిపై కూడా కర్రలతోదాడి చేశారు. ఈ దాడుల్లో శ్రీనివాసయాదవ్, చెంచుబాబు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పుత్తూరు డీఎస్పీ రవికుమార్, సీఐ రవీంద్ర, పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ నరేష్ సిబ్బందితో గ్రామానికి చేరుకుని పరిస్థితిని సర్దుబాటు చేశారు. క్షతగాత్రులను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ముందస్తు చర్యగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.



శ్రీనివాసయాదవ్

బీజేపీ జెండాతో తిరుమలకు కారు



పార్టీ జెండాతో ఉన్న కారు

తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ పార్టీ జెండాతో మంగళవారం ఓ కారు తిరుమలలో కనిపించింది. అలిపిరి తనిఖీలను దాటుకుని బీజేపీ జెండాతో తిరుమలకు చేరుకున్న కారు వరాహస్వామి విశ్రాంతి భవనం వద్ద కనిపించింది.

వైద్యాధికారి తీరుపై విచారణ

వెంకటగిరి, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ప్రభుత్వాస్పత్రి ఇన్‌చార్జి వైద్యాధికారి జిలానీ బాషా తీరుపై మంగళవారం విచారణ జరిగింది. రోగులకు సరైన వైద్యం అందించడం లేదని, సహచర వైద్యులు, సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్నారని జిలానీ బాషాపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఇటీవల ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆ సమయంలో వైద్యాధికారి జిలానీ బాషా తీరుపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉన్నతాధికారుల బృందం ఆస్పత్రికి చేరుకొని విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది, జిలానీ బాషా వేధింపుల గురించి అధికారుల బృందానికి వివరించారని సమాచారం. సిబ్బంది చెప్పినవి విషయాలు నమోదు చేసుకోవడంతో పాటు ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు విచారణాధికారులు తెలిపారు. ఈ విచారణ బృందంలో గూడూరు ఏరియా ఆస్పత్రి సివిల్ సర్జన్ డి.రాజా, పరిపాలనా అధికారి బి.కమల్ కిరణ్, సూళూరుపేట ఏరియా ఆస్పత్రి జూనియర్ అసిస్టెంట్ ఎలికే కరీనా ఉన్నారు.



వైద్యాధికారి జిలానీ బాషాతో మాట్లాడుతున్న విచారణాధికారులు

హైవే, రైల్వే ప్రాజెక్టు భూసేకరణ పనులు వేగవంతం చేయండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, వైజాగ్ - చెన్నై కారిడార్ పైపులైను పనులు, పలు భూసంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక బద్ధంగా నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పీడీలు, ఆర్డీవోలు తదితర అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, వైజాగ్ - చెన్నై కారిడార్ పైపులైను పనులు, రైల్వే ప్రాజెక్టు పనులు, పురోగతిలో ఉన్న పనులపై రేణిగుంట, పూడి, గూడూరు, రేణిగుంట, పాకాల, తిరుపతికి సంబంధించి రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. పెండింగ్ భూసమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామ్మోహన్, కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, తిరుపతి, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు విజయభరత్‌రెడ్డి, శివకుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

జిల్లా యంత్రాంగానికి అభినందనలు

మొంథా తుఫాన్ సహాయక చర్యల్లో పాల్గొని సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేసిన జిల్లా యంత్రాంగానికి కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. రానున్న రెండు నెలలు ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, వ్యవసాయశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ రోజ్మాండ్, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

మరింత సమర్థంగా వ్యర్థాల నిర్వహణ

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్

తిరుపతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. మంగళవారం పద్మావతి అతిథి గృహంలో నగరపాలక సంస్థ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. చెత్త సేకరణ, తరలింపు, ప్రాసెసింగ్ తదితర విషయాలను డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌లు ఆయనకు వివరించారు. అనంతరం పట్టాభిరామ్ మీడియాతో మాటాడుతూ గత ప్రభుత్వం వదిలేసిన కొన్ని వేల టన్నుల చెత్తను శుభ్రం చేస్తున్నామన్నారు. చెత్త శుభ్రం చేసిన ప్రాంతాలను సుందరమైన పార్కులుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మతో కలసి పార్కులు పెంచి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం తెచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. తూకివాకంలోని ఇంటిగ్రేటెడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ను తమ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. రీసైక్లింగ్ ఫ్యాక్టరీలు కూడా తిరుపతి ప్రాంతాల్లో రానున్నాయని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మునిసిపల్ ఇంజినీర్ తులసికుమార్, డీఈ రమణ, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

21 కిలోల గంజాయి స్వాధీనం ఒడిశాకు చెందిన ఇద్దరి అరెస్టు



గంజాయి, నిందితులతో సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ నాగరాజు

పెళ్లకూరు, నవంబరు, 4 (ఆంధ్రజ్యోతి): బేల్దారి పనుల ముసుగులో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఒడిశాకు చెందిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు... పెళ్లకూరు మండలంలోని 71వ జాతీయ రహదారిలో తాళ్వాయిపాడు అండర్ పాస్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని సోమవారం సాయంత్రం ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఒడిశా రాష్ట్రం, కలహండి జిల్లా, పండకమాల్ గ్రామానికి చెందిన గోపీనాథ్ బీబార్, మితిన్ బీబార్‌గా తెలిసింది. వారివద్ద నుంచి 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తిరుపతిలో బేల్దారు పనులు చేసుకుంటున్న పండకమాల్ గ్రామానికి బలరాం వద్ద గోపీనాథ్ బీబార్, మితిన్ బీబార్ ఇటీవల పనిలో చేరారు. గంజాయి అక్రమ రవాణా చేసి ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని సావీర్ అనే వ్యక్తి వీరికి ఆశ చూపాడని విచారణలో తెలిసింది. నిందితులు ఇద్దరినీ నాయుడుపేట కోర్టులో హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



జస్టిస్ ఈశ్వరయ్య

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఉన్నారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి



నిమ్మగడ్డ రమేష్‌కుమార్

నిప్పంటుకుని వృద్ధుడి మృతి


నాగరాజరెడ్డి (ఫైల్ ఫొటో)

రామకుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీడీ వెలిగించుకునే ప్రయత్నంలో అగ్గిపుల్ల మంటలు దుస్తులపై పడి తీవ్రగాయాలకు గురైన ఓ వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రామకుప్పం పోలీసుల కథనం మేరకు.. విజలాపురానికి చెందిన నాగరాజరెడ్డి (70) సోమవారం సాయంత్రం బీడీ తాగేందుకు అగ్గిపుల్లను వెలిగించాడు. ప్రమాదవశాత్తు అగ్గిపుల్ల కట్టుకున్న పంచపై పడింది. దీంతో మంటలు వ్యాపించి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు గుర్తించి కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. నాగరాజరెడ్డి అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లావారుజామున మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నాన్న వస్తాడు.. టెర్రస్‌పైకి పంపండి

● హాస్టల్‌పైకి వెళ్లి ఇంజనీరింగ్ విద్యార్థి బలవన్మరణం


సాయి చందు మృతదేహం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 'మా నాన్నకు ఫోను చేశా. వస్తాడు. వచ్చిన వెంటనే టెర్రస్ పైకి పంపండి. నేను కొంచెం మాట్లాడాలి' అంటూ సహ విద్యార్థులకు చెప్పాడు. హాస్టల్‌పైకి వెళ్లి బలవన్మరణానికి పాల్పడ్డాడు. బిడ్డతో మాట్లాడదామని వచ్చిన తండ్రికి శవమై ఎదురుగా కనిపించడంతో గుండెలు బాదుకుని విలపించారు. ఈ విషాద ఘటన తిరుపతి- రేణిగుంట రోడ్డులోని ఓ ఇంజనీరింగ్ విద్యాసంస్థలో చోటు చేసుకుంది. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. నెల్లూరు నగరం స్టోన్‌హౌస్‌పేటకు చెందిన శ్రీనివాసులు కుమారుడు సాయి చందు(20) తిరుపతి - రేణిగుంట మార్గంలోని కళాశాలలో బీటెక్‌లో చివరి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం రాత్రి తన తండ్రి శ్రీనివాసులుకు ఫోన్ చేసి, 'నిన్ను చూడాలని ఉంది. ఒకసారి రా. అలాగే ఫీజు కట్టాలి' అని చెప్పాడు. ఉదయం వస్తానని తండ్రి చెప్పారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు హాస్టల్‌లో తోటి స్నేహితుల వద్దకు వెళ్లి మరి కొద్దిసేపటిలో తన తండ్రి వస్తారని, టెర్రస్‌పైన తన వద్దకు పంపాలని సాయిచందు చెప్పి వెళ్లాడు. గంట తర్వాత శ్రీనివాసులు హాస్టల్‌కు రాగా.. మిద్దెపైన సాయిచందు ఉన్నాడని ఓ విద్యార్థి తీసుకెళ్లాడు. అక్కడ కిటికీ ఊచకు ఉరేసుకుని, నిర్జీవంగా సాయిచందు కనిపించాడు. అందరూ కేకలు వేసి సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుచానూరు పోలీసులు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. ఓ అమ్మాయి ప్రేమ విషయంలో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ తెలిపారు. ఇంటికి అండగా ఉంటాడనుకున్న సమయంలో ఇలా కొడుకు అర్థంతరంగా తనువు చాలించడంతో శ్రీనివాసులు గుండెలు అవిసేలా విలపించడం అక్కడి వారికి కన్నీరు పెట్టించింది.

హమ్మయ్య.. సబ్ రిజిస్ట్రార్ వచ్చారు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు చకచకా జరిగాయి.రెండు రోజుల సెలవుపై వెళ్లిన సబ్‌రిజిస్ట్రార్ ఆనందకుమార్ తన సెలవును రద్దు చేసుకుని మంగళవారం హుటాహుటిన విధులకు హాజరయ్యారు.అధికారులు లేక సోమవారం రిజిస్ట్రేషన్లు ఆగాయని ఆంధ్రజ్యోతిలో మంగళవారం వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే.సోమవారం ఆగిన డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లను ఆయా కక్షిదారులను పిలిపించి మంగళవారం చేయడంతో సమస్య తీరింది. కాగా ముందస్తు అనుమతి లేకుండా సెలవుపై వెళ్లిన కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ప్రత్యూషకు అధికారులు మెమో జారీ చేసే అవకాశముంది.

వరి కోతలకు రైతుల పాట్లు

● నూర్పిడి యంత్రాలకోసం పడిగాపులు


వరి కోతలు చేస్తున్న యంత్రం

సోమల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి సాగు చేసిన వరి పంట కోతలకు నూర్పిడి యంత్రాల కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. మూడు రోజులుగా వర్షం విరామం ఇవ్వడంతో రైతులు నూర్పిడి యంత్రాల కోసం పోటీపడుతున్నారు. ఇదే అదునుగా తమిళనాడు నుంచి మండలానికి వచ్చిన నూర్పిడి యంత్రాల యజమానులు, దళారులు అధిక ధరలు చెప్పి వసూళ్లు చేస్తున్నారు. సోమల పంచాయతీలో ఒకే యంత్రం ఉండటంతో వాటి వెంట పరుగులు పెడుతున్నారు. గత ఏడాది గంటకు రూ.2,200 నుంచి రూ.2800 వరకు ఉండేది. ప్రస్తుతం గంటకు రూ.3500, దీంతోపాటు డ్రైవర్ బత్తా రూ.100 డిమాండ్ చేస్తూ అధిక ధరలు నిర్ణయించారు. రైతులు విధిలేక అదే ధర చెల్లించి నూర్పిడి చేసుకుంటున్నారు. మళ్లీ వర్షాలు వస్తే కోతలు ఇబ్బందిగా మారుతాయని, ఇదే అదునుకు కోతలు పూర్తి చేయాలని నూర్పిడి యంత్రాల కోసం పొలాల వద్ద నిరీక్షిస్తున్నారు. కూలీల కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. సోమల మండలంలో 1600 ఎకరాల్లో వరి సాగు ఉంది. ప్రస్తుతం కోతలకు రైతులు పోటీలు పడుతున్నారు.

కోర్టు చుట్టూ కుప్పం నేతల ప్రదక్షిణలు


చిత్తూరు కోర్టు వద్ద కుప్పం నియోజకవర్గ టీడీపీ నేతలు

రామకుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కావచ్చినా కుప్పం నియోజకవర్గ నేతలను వైసీపీ పాలనలో నమోదు చేసిన కేసులు వెంటాడుతూనే ఉన్నాయి. రెండున్నరేళ్ల క్రితం విపక్ష నేత హోదాలో చంద్రబాబు సొంత నియోజవర్గంలో పర్యటించారు. ఆయనకు స్వాగతం పలుకుతూ రామకుప్పం మండలం కొంగనపల్లె పంచాయతీ కొళ్ళపల్లెలో టీడీపీ శ్రేణులు స్వాగత తోరణాలు కట్టారు. అదే సమయంలో వైసీపీ శ్రేణులు తమ పార్టీ తోరణాలు కట్టి కవ్వింపు చర్యలకు పాల్పడ్డాయి. చంద్రబాబు కొంగనపల్లెలో పర్యటిస్తూ కాసేపట్లో కొళ్ళపల్లెకి వస్తున్నారనగా వైసీపీ శ్రేణులు టీడీపీ శ్రేణులపై రాళ్లవర్షం కురిపించారు. వారిని కట్టడి చేయాల్సిన పోలీసులు టీడీపీ శ్రేణులను తరిమిగొట్టారు. ఈ నేపథ్యంలో స్థానిక వైసీపీ కార్యకర్తలతోపాటు అప్పటి రాళ్లబూదుగూరు ఎస్‌ఐ మునస్వామి ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, చంద్రబాబు పీఏ మనోహర్‌లతోపాటు నియోజకవర్గంలోని పలువురు కీలక నేతలపై హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. కుప్పం పర్యటన ముగించుకుని తిరుగుపయనమైన చంద్రబాబుకు వీడ్కోలు పలికి వస్తున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారిశ్రీనివాసులు, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, నూలుకుంటకు చెందిన సుబ్బు, శాంతిపురం మండలంకు చెందిన ఆర్‌ఎస్‌మణి, కుప్పం మండలంకు చెంతిన ముఖేష్, మంజు, అప్పులను పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అప్పట్లో వారు నెలరోజులకు పైగా జైలులో ఉన్నారు. ఏడాది క్రితం వరకు కేసులో ఉన్న వారు కుప్పం కోర్టుకు హాజరయ్యేవారు. ఏడాది నుంచి వాయిదాలకు చిత్తూరు కోర్టుకు హాజరవుతున్నారు. ఇప్పటి వరకు 7 సార్లు వారు చిత్తూరు కోర్టుకు హాజరయ్యారు. తాజాగా సోమవారం చిత్తూరు కోర్టుకు వెళ్లారు. మంగళవారానికి కేసు వాయిదా పడటంతో హాజరయ్యారు. తిరిగి బుధవారం కోర్టుకు హాజరు కావాలని న్యాయమూర్తి తమను ఆదేశించారని తెలిపారు. మంగళవారం కోర్టుకు హాజరైన వారిలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, సీఎం పీఏ మనోహర్, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, టీటీడీ సభ్యుడు శాంతారాం, కడా పీఏసీ మెంబరు రాజ్‌కుమార్, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్, తెలుగు యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శంకర్‌చలం, టీడీపీ శాంతిపురం మండలాధ్యక్షుడు ఉదయ్‌కుమార్, మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథనాయుడు, ఆర్‌ఎస్ మణి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, రెస్కో డైరెక్టరు విజయ్‌కుమార్, నేతలు ఏఎంసీ నాగరాజు, వేలు, బాలకృష్ణ, మణి, ఎల్లప్ప, సుబ్బు తదితరులున్నారు. వారి వెంట రామకుప్పం సింగిల్‌విండో ఛైర్మన్ మహ్మద్‌రఫీ, టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటాచలం ఉన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యసేవలు
అందించడానికి చర్యలు: కలెక్టర్


కేంద్ర బృందంతో సమావేశమైన కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందించడానికి చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో అందిస్తున్న వైద్య సేవలపై జాతీయ కేంద్ర, ఆరోగ్య మిషన్ బృందానికి మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు వచ్చిన కేంద్ర బృందం మంగళవారం నుంచి ఈనెల ఏడో తేదీవరకు అన్ని ఆస్పత్రులను పరిశీలిస్తుందన్నారు. తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలందించే దిశగా కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా టాటా డిజిటల్ నర్వ్ సెంటర్ నుంచి ఫలితాలు సాధిస్తున్నామని వెల్లడించారు. సీఎం చంద్రబాబు సూచనతో ఈ కార్యక్రమాన్ని జిల్లా అంతటా విస్తృత పరుస్తున్నట్లు చెప్పారు. 2030కి ముందే మాతాశిశు ఆరోగ్య సంబంధ స్థాయిని జిల్లా సాధించిందన్నారు. ఇప్పటి వరకు 18 ఏళ్ల పైబడిన మహిళా జనాభాలో మధుమేహం, రక్తపోటు, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ స్ర్కీనింగ్ 72.4 శాతం జరిపామని తెలియజేశారు. ఈ సమావేశంలో జాతీయ ఆరోగ్య మిషన్, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ కన్సల్టెంట్ హరికృష్ణన్, రీసెర్చ్ కో-ఆర్డినేటర్ పార్థవి థాంపీ, రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థల వనరుల కేంద్ర అసోసియేట్ ప్రొఫెసర్ సీవీఎస్ రాయుడితోపాటు 12 మంది బృంద సభ్యులు, డీఎంహెచ్‌వో సుధారాణి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పంటలపై ఆగని గజ దాడులు

● మామిడి, వరి పంటలకు అపారనష్టం



ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడి చెట్లను పరిశీలిస్తున్న ఎఫ్‌బీవో మధుబాబు - ధ్వంసమైన వరిపంట

కల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల మంద దాడులు ఆగడం లేదు. మండలంలోని దేవళంపేట, కమ్మపల్లి పంచాయతీల్లో సోమవారం రాత్రి 16 ఏనుగుల మంద పంటలను ధ్వంసం చేయడంతో మామిడిచెట్లు, వరిపంటలకు అపారనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చెంతలవంక నుంచి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ గెండేవారిపల్లి వద్దకు చేరుకున్నాయి. గెండేవారిపల్లి, కమ్మపల్లి, దేశిరెడ్డిగారిపల్లి గ్రామాల్లోని పలువురి రైతుల మామిడి చెట్లను విరిచేశాయి. వరి పంటను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. ధ్వంసమైన పంటలను అటవీశాఖ సిబ్బంది పరిశీలించారు. ధ్వంసమైన పంటలకు నష్ట పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని ఎఫ్‌బీవో మధు తెలిపారు. మంగళవారం పగలంతా అడవిలోని ఎగువచలం వద్ద ఏనుగుల మంద తిష్ఠ వేసినట్లు ప్రజలు తెలిపారు.

చిరుతల కట్టడికి ప్రణాళిక

● త్వరలో వైల్డ్‌లైఫ్ అథారిటీ బృందం తిరుపతికి రాక
● అటవీశాఖ అధికారి సాయిబాబా వెల్లడి



మంగళం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 'ఆహారం కోసం శునకాలు, ఇతర ప్రాణుల కోసం చిరుతలు అడవి నుంచి బయటకు వస్తున్నాయి. ఇలా తిరుపతిలోని విశ్వవిద్యాలయాల ఆవరణ.. జీవకోన, మంగళం ప్రాంతాల్లో తిరుగుతున్నాయి. వీటి కట్టడికి శాశ్వత ప్రణాళిక కోసం వైల్డ్ లైఫ్ అథారిటీతో సంప్రదిస్తున్నాం. త్వరలోనే ఒక బృందం ఈ ప్రాంతాల్లో పర్యటిస్తుంది' అని జిల్లా అటవీశాఖ అధికారి సాయిబాబా చెప్పారు. తిరుపతిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్లు లేని రోజుల్లోనూ చిరుతల కదలికలు ఉండేవని, ఇప్పుడు సోషల్ మీడియా ఉండటంతో ఎక్కువగా వైరల్ అవుతున్నట్లు చెప్పారు. చిరుతలు యూనివర్సిటీ పరిధిలోకి రాకుండా సోలార్ కంచె ఏర్పాటు ప్రతిపాదనను వైల్డ్‌లైఫ్ అథారిటీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. తిరుమల నడక మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటుపైనా చర్చిస్తామన్నారు. ఎస్వీయూ, వెటర్నరీ వర్సిటీ ప్రాంతాల్లో, అలిపిరి నుంచి జూపార్కు రోడ్డులో ఆహార వ్యర్థాలు పడేయకుండా చూడాలన్నారు. ట్రాప్‌కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో సాయంత్రం 6 నుంచి ఉదయం 6గంటల వరకు ఒంటరిగా తిరగరాదన్నారు. చిరుతలపై అవగాహన కల్పించేలా బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. వీటిపై వైల్డ్ లైఫ్ అథారిటీతో చర్చించాక తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. జిల్లాలో 40వరకు ఏనుగులు మూడు గ్రూపులుగా భాకరాపేట, మామండూరు, పనపాకం ప్రాంతాల్లో సంచరిస్తున్నాయని తెలిపారు. పాపవినాశం, నడకమార్గంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న షాపులపై పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

పవన్ పర్యటనపై కలెక్టర్ పరిశీలన


అటవీశాఖ అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పలమనేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) :ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 8వ తేది పలమనేరు పర్యటనకు రానుండడంతో ఏర్పాట్ల పరిశీలనకు మంగళవారం కలెక్టర్ సుమిత్ కుమార్ వచ్చారు. ముసలిమడుగు వద్ద ఏర్పాటు చేసిన ఎలిఫెంట్ క్యాంపును పవన్‌కళ్యాణ్ ప్రారంభించనుండడంతో ఆ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముసలిమడుగును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. కార్తీక మాసం సందర్భంగా ప్రజలు అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తారని,ఇక్కడే వనమహోత్సవ కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు త్వరితగతిన చేపట్టాలని సూచించారు.డిప్యూటీ సీఎం పర్యటన సందర్భంగా కుంకీ ఏనుగులను ప్రధాన వేదికకు దూరంగా మావటీలు, వెటర్నరీ సిబ్బంది పర్యవేక్షణలో ఉంచాలన్నారు. ఏనుగులుండే ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాట్లు చేయాలన్నారు.జిల్లా అటవీశాఖ అధికారి సుబ్బరాజు, అదనపు డీఎఫ్‌వో నారాయణ , ఆర్డీవో పి. భవాని, సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, రేంజర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు డీఎంపురం విద్యార్థులు


క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం, తదితరులు

వెదురుకుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సరస్వతి, వ్యాయామ సంచాలకుడు కిషోర్‌కుమార్ మంగళవారం తెలిపారు. రగ్బీ పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో పదో తరగతి విద్యార్థిని యామిని, బాలుర విభాగంలో సాయికిరణ్, అండర్-14 బాలికల విభాగంలో ఇంద్రజ ఎంపికయ్యారన్నారు. అలాగే వాయల్పాడులో జిల్లా స్థాయిలో జరిగిన నెట్‌బాల్ పోటీల్లో ఆకాష్ కూడా రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారడన్నారు. వీరిని పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ త్యాగరాజు, వైస్ ఛైర్‌పర్సన్ సంధ్య, ఉపాధ్యాయులు మాలతి, కళైవాణి, రవి, రాములు, రంజిత్‌కుమార్‌తో కలిసి అభినందించారు.

గిరిజనులందరికీ గ్యాస్ కనెక్షన్ ఇవ్వాలి: కలెక్టర్


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గుర్తించిన 411 గిరిజన కుటుంబాలకు వెంటనే ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ ఇవ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద అర్హత ఉండాలంటే గిరిజన కుటుంబ సభ్యుల పేరుపై ఎల్‌పీజీ కనెక్షన్ ఉండకూడదని గుర్తు చేశారు. కేంద్రం దేశవ్యాప్తంగా 25లక్షల కనెక్షన్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అందజేసేందుకు చర్యలు చేపట్టిందని చెప్పారు. ఇందుకోసం లబ్ధిదారులు డిపాజిట్ కింద రూ.1,700, రెగ్యులేటర్‌కు రూ.150, డాక్యుమెంటేషన్ ఖర్చుకు రూ.75 చెల్లించాలని సూచించారు. డీఎస్వో శంకరన్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ లక్ష్మి పాల్గొన్నారు.

నాటు తుపాకి స్వాధీనం : ఒకరి అరెస్టు


నిందితుడి వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

బంగారుపాళ్యం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాటు తుపాకి కలిగిన ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కొదలమడుగు పంచాయతీ బండ్లదొడ్డికి చెందిన లోకరాజ్ కుమారుడు రెడ్డెప్ప (50) వన్యప్రాణులను వేటడానికి సింగిల్ బ్యారెల్ నాటు తుపాకీని కలిగి ఉన్నాడన్న సమాచారంతో దాడులు చేశారు. గ్రామ సమీపంలోని బసిరెడ్డి మామిడితోటలో అదుపులోకి అతడిని తీసుకున్నారు. అతడి నుంచితుపాకి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ ప్రసాద్, ఏఎస్‌ఐ మల్లప్ప, హెడ్ కానిస్టేబుల్ కిరణ్, సిబ్బంది మోహన్, మురళి పాల్గొన్నారు.

నత్తనడకన తుడా ఎల్‌ఆర్‌ఎస్

● 2674 దరఖాస్తుల్లో 36కే అప్రూవల్
● సమన్వయలోపంతో కదలని ఫైళ్లు



తిరుపతి- ఆంధ్రజ్యోతి: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) పరిధిలో అనధికార లేఅవుట్లు, స్థలాల క్రమబద్ధీకరణకు తీసుకొచ్చిన లేఅవుట్ రెగ్యులరైజ్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) నత్తనడకన సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 23కే ముగియాల్సిన గడువు వచ్చే ఏడాది జనవరి 23వరకు (మూడు నెలలు) పొడిగిస్తూ అవకాశం కల్పించినా.. క్షేత్రస్థాయిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో పురోగతి కనిపించడం లేదు. ఎక్కువ దరఖాస్తులు ప్రాథమిక స్థాయి పరిశీలనలోనే నిలిచిపోతున్నాయి. ఆన్‌లైన్ అప్లికేషన్లు నెలల తరబడి పెండింగ్‌లో ఉండడం, పలుచోట్ల అప్పటికే నగదు చెల్లించినా, బాధితులకు సమాచారం లేకపోవడం వంటి అంశాలు బయటపడుతున్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయి సిబ్బంది లోపం, అధికారులతో సమన్వయం లేకపోవడం, శాఖల మధ్య సమాచారం చేరకపోవడం వంటివి ప్రధాన కారణాలుగా తెలుస్తున్నాయి. 2020 లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకంలో 4254 దరఖాస్తులు అందగా.. అందులో 2466 ఆమోదించి ఎల్‌ఆర్‌ఎస్ ఇచ్చారు. సవరణలతో కొనసాగింపుగా వచ్చిన ఎల్‌ఆర్‌ఎస్-2025 ద్వారా వచ్చినవాటితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్నవి కలిపి ఇప్పటికే 2674 అప్లికేషన్లు అందాయి. వీటిలో ఇప్పటివరకు కేవలం 36 మాత్రమే అప్రూవల్ అయ్యాయి. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా సుమారు రూ.25 కోట్ల ఆదాయాన్ని తుడా లక్ష్యంగా పెట్టుకుంది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల లెక్క చూస్తే ఆ దిశగా పనిచేయనట్లు అర్థమవుతోంది.

915 అనధికార లేఅవుట్లు

2025 జూన్ 30 నాటికి రిజిస్టర్ అయిన అనధికారిక, ఆమోదం లభించని ప్లాట్లను క్రమబద్ధీకరించే లక్ష్యంతో ఎల్‌ఆర్‌ఎస్ అమలు చేస్తున్నారు. జిల్లాలో ఏర్పాటైన లేఅవుట్లకు 60 శాతం వరకు అనుమతులు లేవు. 2025 అక్టోబరు నాటికి తుడా పరిధిలో 915 అనధికార లేఅవుట్లు గుర్తింపయ్యాయి. వీటిలో 630 గ్రామీణ ప్రాంతాలు, 285 పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి. సుమారు 20వేలకు పైగా ప్లాట్లు ఎల్‌ఆర్‌ఎస్ తీసుకునేందుకు అవకాశం ఉంది.

ఎల్‌ఆర్‌ఎస్ తీసుకుంటే...

ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోవడం వల్ల స్థలానికి చట్టబద్ధత వస్తుంది. ఇంటి నిర్మాణానికి అనుమతులు సులభంగా వస్తాయి. మౌలిక వసతుల కల్పన బాధ్యత స్థానిక సంస్థతీసుకుంటుంది. బ్యాంకు రుణాలతో పాటు క్రయ, విక్రయాలకు అడ్డంకులు ఉండవు. స్థల యజమానులు కూడా దీనిపై అవగాహన లేక అవకాశాన్ని చేజార్చుకుంటున్నారనే చెప్పాలి.

ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు	2674
అప్రూవల్ అయినవి	36
ఫీజు ఇంటిమేషన్	19
షార్ట్ ఫాల్	5
పెండింగ్ దరఖాస్తులు	2614

పీఆర్సీ, డీఏలను ప్రకటించాలి



పాఠశాల ఆవరణలో సమావేశమైన ఫ్యాప్టో నాయకులు

కుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు అందాల్సిన అన్నిరకాల ప్రయోజనాలను వెంటనే ప్రకటించి అమలు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మోహన్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుప్పం మండలం గుడ్లనాయనిపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మోహన్ యాదవ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన టెట్ తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీ, డీఏ, పీఎఫ్, ఈఎల్‌లను వెంటనే చెల్లించాలని కోరారు. పే రివిజన్ కమిషన్‌ను నియమించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు చిట్టిబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ఫ్యాప్టో తరపున దశల వారీగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్ర కౌన్సిలర్ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. బోధనేతర కార్యక్రమాలకు తమను దూరంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం నాయకులు సురేశ్, తిమ్మరాజు, ఇతర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కుప్పం మండలం వి.మిట్టపల్లె గ్రామంలో మంగళవారం టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ పార్టీలో నాయకుల మధ్య ఉన్న విభేదాలను పక్కనెట్టి, పార్టీ కోసం పని చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకుని అధినేత చంద్రబాబుకు కానుకగా ఇవ్వాలన్నారు. పార్టీ పటిష్ఠతకు ప్రజలతో మమేకమవడం తప్ప మరో మార్గాంతరం లేదన్నారు. గ్రామగ్రామాన నాయకులు విస్తృతంగా పర్యటిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో కుప్పం నియోజకవర్గంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అలా చేయాలంటే ముందు నాయకులు, ఆయా కార్యక్రమాల గురించి, ప్రజలకు కూటమి ప్రభుత్వంలో చేకూరుతున్న ప్రయోజనాల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యకర్తలపై మర్యాదగా మెలగాలని, వారికి అన్నిరకాలుగా అండగా నిలబడాలని సూచించారు. పార్టీ జెండాను భుజాన మోసే కార్యకర్తలను పట్టించుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.రాజగోపాల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్త పరీక్ష శిబిరం విజయవంతం



మటార్లపల్లెలో గ్రామస్తులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం మటార్లపల్లె గ్రామంలో మంగళవారం భవ్య హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్‌తో గ్రామస్తులకు ఉచిత రక్త పరీక్షల శిబిరం నిర్వహించారు. గ్రామంలోని 47 మంది ఈ శిబిరంలో రక్త పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కుప్పం నియోజకవర్గ ఐటీడీపీ ఉపాధ్యక్షుడు ఈఆర్‌బీ బాలాజీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతో నియోజకవర్గంలోని ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎన్నో పథకాలు అమలవుతున్నాయన్నారు. ఉచిత రక్త పరీక్షల శిబిరాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయం



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవంలో నేతలు

రామకుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కుప్పం విద్యుత్ సహకార సంస్థ(రెస్కో) పరిధిలో వినియోదారుల సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా పాలకవర్గం కృషి చేస్తుందని రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, టీడీపీ రామకుప్పం మండల మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. మంగళవారం రామకుప్పం మండలం గడ్డూరుయానాది కాలనీ సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రెస్కో పాలకవర్గ పెద్దల అవినీతి, అస్తవ్యస్త విధానాలతో లాభాల్లో ఉన్న సంస్థ ప్రస్తుతం వందకోట్ల నష్టాల్లో కూరుకుపోయిందన్నారు. సీఎం చంద్రబాబు నియోజకవర్గ ప్రజలు, రైతులు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నష్టాలను అధిగమిస్తూ వినియోగదారుల సమస్యలు సత్వరం పరిష్కారం కోసం తమ సహకారం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రెస్కో డైరెక్టర్ సతీష్, మాజీ సర్పంచులు పెరుమాళ్, సుబ్రహ్మణ్యం, నేతలు మురళీమోహన్, బాలరాజు, మణీ, చంద్ర, మురుగేష్, రెస్కో సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో విశ్రాంత న్యాయశాఖ ఉద్యోగి మృతి

పలమనేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : న్యాయశాఖలో పరిపాలనాధికారిణిగా పనిచేసి పదవీ విరమణ పొందిన స్థానిక రజక వీధిలో నివాసమున్న సరస్వతమ్మ గుండెపోటుతో సోమవారం మృతిచెందారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. గిరిజన ఉద్యోగ సంక్షేమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కేవీరమణ, సీపీ ప్రకాష్, కౌన్సిలర్ కె.ఎం.నాగరాజు, కార్యవర్గ సభ్యులు తిరుమల రావు, యువరాజు, నేతాజీ, డాక్టర్ అరుణ్, సురేష్ నివాళులర్పించారు.



సరస్వతమ్మ (ఫైల్ ఫొటో)

పేదరిక నిర్మూలనే పీ-4 లక్ష్యం



పీ-4పై అవగాహన కల్పిస్తున్న నేతలు

రామకుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలనలో భాగంగా సీఎం చంద్రబాబు పీ-4 కార్యక్రమాన్ని ప్రారంభించారని టీడీపీ రామకుప్పం మండల మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం బందార్లపల్లె పంచాయతీ గడ్డూరు యానాది కాలనీలో గ్రామస్థులకు పీ-4 కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెస్కో డైరెక్టర్ సతీష్, మాజీ సర్పంచులు పెరుమాళ్, సుబ్రహ్మణ్యం, నేతలు మురళీమోహన్, బాలరాజు, పీ-4 సీఆర్పీ భారతి పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలి



చింతకుప్పంలో రక్తపరీక్షలు చేసుకున్న గ్రామస్తులు

రామకుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అందరూ ఆరోగ్యంతులుగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఐటీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జ్ఞానశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రామకుప్పం మండలం చింతకుప్పం గ్రామంలో ఉచిత రక్తపరీక్షా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాకారంలో భాగంగా సీఎం చంద్రబాబు పైలట్ ప్రాజెక్టుగా కుప్పం నియోజకవర్గంలో ప్రతిఒక్కరికీ 46 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. పరీక్షల ఫలితాల ఆధారంగా వారికి మెరుగైన వైద్యం అందించి వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించేలా చూస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి సుబ్రహ్మణ్యం, నేతలు రామచంద్ర, ఆనంద్, మంజు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తిని పెంచడానికే చెకుముకి పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం

కల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు సైన్స్‌పై ఆసక్తిని పెంచడానికే చెకుముకి సైన్స్ పోటీలు నిర్వహిస్తామని పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మండల స్థాయి సైన్స్ టాలెంట్ చెకుముకి పోటీలు నిర్వహించారు. మండలంలోని కల్లూరు, పులిచెర్ల, మంగళంపేట, ఎల్లంకివారిపల్లి, కావేటిగారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు పరీక్షలో పాల్గొనగా మంగళంపేట విద్యార్థులు గీతాశ్రీ, చరణ్, యశస్విని ప్రతిభ చూపడంతో జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు అర్హత సాధించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సైన్స్ ఉపాధ్యాయులు గుర్రయ్య, నవాబ్‌జాన్, రహమత్‌బాషా, చంద్రబాబు, ధనంజయ, హుస్సేన్‌బాషా పాల్గొన్నారు.

కొళాయిల లీకేజీలను అరికట్టండి



కొళాయి లీకేజీతో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

కల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ కేంద్రంలోని ఓ వీధిలో సుమారు 3 నెలలుగా తాగునీటి కొళాయి లీకేజీ అవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో బోరు బావుల్లో వస్తున్న కొత్త నీళ్లతో అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వేడి చేసి చల్లార్చిన నీటినే తాగాలని వైద్యులు సూచనలిస్తున్నారు. ఇలాంటి వర్షాకాలం సమయంలో కుళాయిల లీకేజీలతో కలుషితమవుతున్న మంచి నీరు తాగుతున్న ప్రజలకు ఇబ్బందులు రాక తప్పేట్లు లేదు. కొళాయిల లీకేజీలపై పంచాయతీ కార్యదర్శి దృష్టికి అనేక పర్యాయాలు తీసుకెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి కొళాయిల లీకేజీలను అరికట్టాలని కోరుతున్నారు.జ

ప్రశ్నించడం విజ్ఞానాభివృద్ధికి పునాది



చెకుముకి పరీక్షల్లో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

పలమనేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రశ్నించడం విజ్ఞానాభివృద్ధికి పునాది వంటిదని పలమనేరు మండల జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి సుదర్శనాచారి పేర్కొన్నారు. మంగళవారం పలమనేరులోని బాలికోన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి పరీక్షలను నిర్వహించారు. పలమనేరు, గంగవరం మండలాలకు చెందిన 105 మంది విద్యార్థులు చెకుముకి పరీక్షలు రాశారు. ఈ సందర్భంగా సుదర్శనాచారి మాట్లాడుతూ విద్యార్థులకు ఈ పరీక్షలు ప్రశ్నించేందుకు దోహదపడుతాయన్నారు. ప్రశ్నించడంతోనే విజ్ఞానం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో సంఘసేవకులు శ్రీపురం సీతారామయ్య, నరేంద్ర, సునీల్ బృందం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి యుగంధర్‌బాబు, కల్లుపల్లి ప్రధానోపాధ్యాయులు చైతన్య, కోశాధికారి గిరిధర్ మూర్తి, సిద్దార్థ, దేవేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే

విద్యుత్తు సబ్‌స్టేషన్ల నిర్మాణాలు

● కృష్ణానగర్, బల్ల గ్రామాల్లో తుది దశకు చేరుకున్న పనులు



కృష్ణానగర్‌లో చురుగ్గా సాగుతున్న సబ్‌స్టేషన్ పనులు

రామకుప్పం, నవంబరు 4 త(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యకు చెక్‌పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మండల పరిధి పంద్యాలమడుగు, గొరివిమాకులపల్లె, పీఎంకేతాండా, బందార్లపల్లె, బల్ల, కెంచనబల్ల, ఉస్సిగానిపల్లె, ముద్దనపల్లె, నారాయణపురం తండాల పరిధిలో ఏళ్లగా లోవోల్టేజీ, విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలతో రైతులు సతమతమవుతున్నారు. ఈ విషయాన్ని రెండేళ్ల క్రితం అమరావతికి వెళ్లిన టీడీపీ మండల నేతలు పార్టీ అధినేత చంద్రబాడు దృష్టికి తీసుకెళ్లారు. 2024 ఎన్నికల్లో తమ ప్రభుత్వం రాగానే ఆ సమస్యల పరిష్కారానికి తప్పక చర్యలు తీసుకుంటానని అప్పట్లో చంద్రబాబు వారికి హామీ ఇచ్చారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరాక ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఈ విషయాన్ని మరోసారి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈనేపథ్యంలో రూ.6.75 కోట్లతో కృష్ణానగర్, బల్ల, ముద్దనపల్లెల్లో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. ప్రస్తుతం కృష్ణానగర్, బల్ల గ్రామాల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణం పనులు చివరి దశకు చేరుకున్నాయి. అలాగే ముద్దనపల్లెలో త్వరలో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ సబ్‌స్టేషన్ల నిర్మాణాలు పూర్తయితే మండలంలో వ్యవసాయ కనెక్షన్లకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతోంది.



కుప్పం రైతుల కష్టాలకు పరిష్కారం

కుప్పం నియోజకవర్గంలో రైతులకు ఎటువంటి కష్టం రాకుండా చూడాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయం. మండలంలో లోవోల్టేజీ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం వచ్చిన రెండునెలల్లోనే రామకుప్పం మండలంలో మూడు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి రూ.6.75 కోట్లు మంజూరు చేశారు. రెండు సబ్‌స్టేషన్ల ఏర్పాటు పనులు 15 రోజుల్లో పూర్తవుతాయి. ముద్దనపల్లెలోనూ త్వరలో పనులు ప్రారంభమవుతాయి. హంద్రీ-నీవా కాలువతో కృష్ణాజలాలు తీసుకొచ్చి కుప్పం ప్రాంతంలో రైతులు అనాదిగా ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యకు చరమగీతం పాడారు. అంతేకాకుండా రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తూ ఆదుకుంటున్నారు. తమను అన్నివిధాలా ఆదుకున్న చంద్రబాబులో కుప్పం రైతులు దైవాన్ని చూసుకుంటున్నారు.

- విశ్వనాథ్, రెస్కో వైస్‌చైర్మన్

పారిశ్రామిక భాగస్వామ్య సదస్సును జయప్రదం చేయండి



మొక్కలు నాటుతున్న లోకల్ అథారిటి సెల్ జీఎం సాంబశివారెడ్డి

పలమనేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13, 14, 15 తేదీల్లో విశాఖలో జరుగనున్న పారిశ్రామిక భాగస్వామ్య సదస్సును జయప్రదం చేయాలని లోకల్ అథారిటీ సెల్ జీఎం సాంబశివారెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం ఆయన పలమనేరులోని నూతన పారిశ్రామిక వాడలోని పారిశ్రామిక వేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక భాగస్వామ్య సన్నాహక కార్యక్రమంలో భాగంగా డీఐసీ, ఏపీఐఐసీ పారిశ్రామిక వాడల్లో నెలరోజుల పాటు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ భార్గవి, ఆటోనగర్ అండ్ ఎంఎస్ఎంఈ యూనియన్ నాయకులు అమరనాథరెడ్డి, ఖాజా, మౌలా, సంతోష్, సీను, సుబ్బు, మహబూబ్, హేమంత్‌నాయుడు, ఖాదర్, జాఫర్, జావీద్, వశీం, జమాల్, జుబేద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

పలమనేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలంలోని దుగ్గినవారిపల్లి, మారుమూరు, కూర్మాయి హెచ్‌డబ్ల్యూ, సాకేఊరు, దిగువకల్లాడు పాఠశాలలను ఎంఈవో లీలారాణి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు, పిల్లల హాజరు పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థి సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈవో

10న వాహనాల వేలం

పుంగనూరు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఎక్సైజ్ ప్రొహిబిషన్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 10న స్థానిక స్టేషన్‌లో బహిరంగ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ సురేశ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్‌కార్డు జిరాక్స్‌తోపాటు ధరావతు రుసుం చెల్లించి వేలంలో పాల్గొనాలని.. వివరాలకు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి షాట్‌పుట్ క్రీడలకు పుంగనూరు విద్యార్థి

పుంగనూరు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి షాట్‌పుట్ క్రీడలకు పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె హైస్కూల్ విద్యార్థిని గానవి ఎంపికైనట్లు పీడీ మురళీధర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థిని గానవి అన్నమయ్య జిల్లా మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన అండర్ -14 షాట్‌ఫుట్ క్రీడా పోటీల్లో జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. దీంతో విద్యార్థిని గానవిని పాఠశాల హెచ్‌ఎం రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



గానవి

పోలీసులకు దుస్తుల వితరణ



సోమల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోమల పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి దాత కామిశెట్టి నగేశ్ రూ.30 వేలు విలువైన దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శివశంకర, శ్రీకృష్ణదేవరాయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మునివెంకటప్ప, ఎస్వీ రమణ, కోశాధికారి జ్యోతీశ్వరుడు, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆత్మనిర్భర్ భారత్‌తో దేశాభివృద్ధి

చౌడేపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆత్మ నిర్భర్ భారత్‌తోనే దేశం ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చెందుతుందని బీజేపీ మండలాధ్యక్షులు మనోహర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లా డుతూ దేశ ప్రధాని మోదీ పిలుపుతో ప్రతి ఇంట స్వదేశీ వస్తువులనే వాడాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని అమినిగుంటలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లికార్జున, ప్రవీణ్, శేఖర్‌బాబు, రెడ్డెప్ప పాల్గొన్నారు.



అమినిగుంటలో ఇంటింటికీ ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో సర్పదోష నివారణ పూజలు



సర్పదోష నివారణ పూజల్లో భక్తులు

రామకుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం సర్పదోష నివారణ పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. రాహుకాల సమయంలో వేదపండితులు నాగరాజశర్మ బృందం వివిధ ప్రాంతాల నుంచి భక్తులచే శాస్త్రోక్తంగా సర్పదోష నివారణ పూజలు చేయించారు. పూజల అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

వాహనాల వేలంతో రూ.3.48 లక్షల ఆదాయం



వేలంలో పాల్గొన్న పోలీసు, ఎక్సైజ్ అధికారులు

వి.కోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండల పరిధిలో ఎక్సైజ్ కేసులో పట్టుబడిన వాహనాలకు మంగళవారం నిర్వహించిన వేలంలో రూ.3.48 లక్షల ఆదాయం సమకూరినట్లు సీఐ సోమశేఖర్ తెలిపారు. చిత్తూరు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కృష్ణకిషోర్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన వేలంలో లగేజీ ఆటో, ఆరు ద్విచక్ర వాహనాలకు పలువురు పోటీపడి వాహనాలను దక్కించుకున్నారు. వేలంలో వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమచేస్తున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై మురళీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రగ్బీ జిల్లా జట్టుకు వి.కోట విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

వి.కోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి శ్రీకాళహస్తిలో ఇటీవల జరిగిన రగ్బీ పోటీల్లో వి.కోటకు చెందిన పలువురు విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. అండర్ 17 క్యాటగిరీలో వి.కోట ఇన్‌ఫ్యాంట్ జీసస్ హైస్కూల్‌కు చెందిన పదో తరగతికి చెందిన అరవింద్, ఉమేష్, చంద్ర, పూజ ఎంపికైనట్లు కరస్పాండెంట్ ట్రీస, పీఈటీలు సుబ్రహ్మణ్యం, శంకర్ తెలిపారు. అలాగే వి.కోట ఉర్దూ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి అయాన్‌బేగ్ అండర్ 14 రగ్బీ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మహ్మద్‌అలీ తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 7, 8, 9 తేదీలో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో జిల్లా అండర్ 14, అండర్ 17 జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థుల ఎంపిక పై వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

అవాస్తవాలతో ప్రజల్ని మభ్యపెట్టలేరు



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

సదుం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టలేరని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్‌కు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి హితవు పలికారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ మంగళవారం పుంగనూరు మున్సిపాలిటీ అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిలపై చేసిన విమర్శలపై వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తీవ్రంగా స్పందించారు. పుంగనూరు నియోజకవర్గాన్ని తండ్రీ కొడుకులు దోచుకున్నారు తప్ప.. అభివృద్ధి గురించి పట్టించుకోలేదని, 23 వేల టన్నుల చెత్తను పట్టణంలో వదిలేశారని, ఆ చెత్తను ప్రభుత్వం తొలగించిందని, పుంగనూరులో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అడ్డుకుంటున్నారన్న పట్టాభిరామ్ విమర్శలపై ఆయన తీవ్రంగా ఖండించారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనకు ముందు, మారిన ఇప్పటి పుంగనూరు అభివృద్ధి రూపురేఖలను తెలుసుకుని మాట్లాడాలన్నారు. నిరాధార ఆరోపణలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, పార్టీ నాయకుల పుత్రాజు, సయ్యద్ బాషా, రమేశ్ రెడ్డి, చిన్న రమణ, ఇర్ఫాన్, మస్తాన్ సాహెబ్, ఎల్లారెడ్డి, రాజశేఖర్, శివశంకర్, ఎం.ఎం.బాషా, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా గాంధీ రోడ్డు విస్తరణ పనులు



ఎక్స్‌కవేటర్‌తో ప్రహరీని తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

చిత్తూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గాంధీరోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మంగళవారం లక్ష్మీ థియేటర్ సమీపంలోని ఓ ప్రైవేటు వ్యక్తికి చెందిన ప్రహరీని టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. డిసెంబరుకల్లా పనులను పూర్తి చేయాలన్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ల ఆదేశాల మేరకు పనులు చేస్తున్నట్లు ఏసీపీ నాగేంద్ర తెలిపారు.

కార్తీక పౌర్ణమికి ఆలయాల వద్ద బందోబస్తు



రాజుగుడి వద్ద ఆలయ నిర్వాహకుడితో మాట్లాడుతున్న సీఐ నెట్టికంఠయ్య

చిత్తూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాశీబుగ్గ వద్ద భక్తుల తొక్కిసలాటలో తొమ్మిది మంది మరణించిన సంఘటన తెలిసిందే. ఈ నేపథ్యంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు. రాజుగుడి, అగస్త్యీశ్వరాలయం, ఇతర శైవక్షేత్రాలను సీఐలు నెట్టికంఠయ్య, మహేశ్వర మంగళవారం రాత్రి పరిశీలించారు. భక్తుల తాకిడి, బారికేడ్లు, తదితర విషయాలపై ఆలయ నిర్వాహకులతో చర్చించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

వెదురుకుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేటకు చెందిన టీడీపీ కార్యకర్త సాంబశివ(48) రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రభుత్వ విప్ థామస్ మంగళవారం రాత్రి సాంబశివ ఇంటికెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.50వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అదే గ్రామానికి చెందిన మోహన్ దాస్ కూడా గాయపడటంతో అతడ్ని కూడా పరామర్శించారు. మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్, టీడీపీ నాయకులు మాదిరాజు మురళీకృష్ణ, చెంగ్రాయయాదవ్, హేమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



ఎమ్మెల్యే జగన్మోహన్‌ను సన్మానిస్తున్న నాయీ బ్రాహ్మణులు

చిత్తూరు సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. మంగళవారం చిత్తూరు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురజాల జగన్మోహన్‌ను కలసి తమ సమస్యలు విన్నవించారు. సమస్యలన్నీ సావధానంగా విన్న ఎమ్మెల్యే పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

వెదురుకుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దర్మాచెరువు గ్రామంలో మంగళవారం వెదురుకుప్పం జడ్పీటీసీ చలంపాళ్యం సుకుమార్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. వైసీపీ అధిష్ఠానం ఆదేశాలతో సంతకాల సేకరణ చేస్తున్నామని తెలిపారు. నాయకులు పొన్నెయ్య, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వన సమారాధన

ఐరాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు అని డీఆర్వో రాకేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ బేబీశ్వరరెడ్డి, అధ్యాపకులు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ ఛైర్మన్ రామిశెట్టి రాజశేఖర్ పర్యవేక్షించారు. ● కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు కూడా పూజలు చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కొప్పేటి ప్రసాద్ పర్యవేక్షించారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా బస్టాండు

● ఎండావానకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



ఎస్ఆర్‌పురంలో నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్

శ్రీరంగరాజపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం ఎస్ఆర్‌పురంలో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి పక్కన పదేళ్ల కిందట ఆర్టీసీ బస్టాండును నిర్మించారు. ఇందులో రెండు దుకాణాలను కూడా ఏర్పాటు చేశారు. కొంతకాలంపాటు ఈ బస్టాండు, దుకాణాలను నడిపారు. ఆ తర్వాత దీని ఆలనాపాలనా గాలికొదిలేశారు. బస్సులను కూడా ఎదురుగా ఉన్న రోడ్డుపై ఆపడం మొదలుపెట్టారు. అప్పటినుంచి బస్టాండు కాస్తా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. మరోవైపు ఎండావానకు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇకనైనా ఈ బస్టాండును ఉపయోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలోనే సుపరిపాలన

● అధికారులూ చిత్తశుద్ధితో పనిచేయాలి
● ప్రభుత్వ విప్ థామస్



అర్జీదారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ థామస్

పాలసముద్రం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందుతోందని, అందుకు అనుగుణంగా అధికారులు కూడా చిత్తశుద్ధితో పనిచేయాలని ప్రభుత్వ విప్ థామస్ సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని నిర్వహించారు. బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి, సంబంధిత అధికారులకు పలు సూచనలిచ్చారు. మండలంలో ప్రభుత్వ భూములంటే పేదలకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ల పట్టాలు మంజూరుకు కృషి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కొందరు వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై బురదచల్లి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. జీడీనెల్లూరు నియోజకవర్గంలో శాంతి భద్రతలు కాపాడే విషయంలో పోలీసులు నిక్కచ్చిగా వ్యవహరించాలని చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, పంటలపై అధికారులు నివేదికలను ప్రభుత్వానికి అందిస్తే మరమ్మతులు చేయించి, రైతులకు నష్టపరిహారం అందజేస్తామన్నారు. అనంతరం శ్రీరంగరాజపురం మండలానికి చెందిన ఏడుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశమై అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ గుర్రప్ప, ఎంపీడీవో సతీష్, ఎస్ఐ రాజశేఖర్, టీడీపీ నాయకులు శివానాయుడు, అరుణ్‌నాథన్, మురళీకృష్ణమరాజు, శేఖర్‌రాజు, సాంబశివన్, నవీన్ చౌదరి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డివైడర్‌ని ఢీకొని లారీ బోల్తా



నగరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ నగర్ సబ్‌స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారి మలుపు వద్ద ధాన్యం బస్తాలు తీసుకెళుతున్న లారీ.. అక్కడున్న డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. అదృష్టవశాత్తూ డ్రైవర్‌కి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

విద్యార్థులకు అభినందన



నగరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో జరిగిన అండర్-17 చెస్ పోటీల్లో ముడిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎ.నవ్యశ్రీ, ఎం.లోహిత ప్రతిభచూపి, రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎం మురళీకృష్ణ, టీచర్ వెంకటేశ్వర్లు అభినందించారు.

ఎమ్మెల్యే మందలించినా అదే తీరు?

● కలిగిరి సచివాలయ సిబ్బంది వ్యవహారంపై స్థానికుల ఆవేదన



పెనుమూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కలిగిరి సచివాలయం సిబ్బంది సకాలంలో రావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉదయం 10.30 గంటలు అయినా తెరుచుకోవడం లేదని.. ఆ తర్వాత వచ్చిన సిబ్బంది కూడా ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గత నెల 31వ తేదీన పల్లెనిద్ర చేసిన ఎమ్మెల్యే థామస్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందిని మందలించినా మార్పు రాలేదని, మంగళవారం సచివాలయాన్ని సమయానికి తెరవలేదన్నారు. దీనిపై కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్ల వితరణ



గంగాధరనెల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తూగుండ్రం జడ్పీ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులకు స్టీల్ ప్లేట్లను ప్రభుత్వఖాజీ మౌలానా అలీఅక్బర్ ఆదేశాలతో ఆవలకొండ అంజుమన్ అబ్బాసియా కమిటీ, అబ్బాసియా చారిటబుల్ ట్రస్ట్‌వారు మంగళవారం వితరణ చేశారు. అంజుమన్ అబ్బాసియా కమిటీ ఛైర్మన్ ఎస్.హెచ్.నియాజ్‌అలీ, అబ్బాసియా చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రహమత్‌అలీ, మతగురువు నబీల్‌రజా, హైస్కూల్ కమిటీ ఛైర్మన్ సుధాకర్‌శెట్టి, హెచ్‌ఎం రాజేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టెట్ నుంచి ఇన్‌సర్వీసు టీచర్లకు మినహాయింపు ఇవ్వాలి: ఎస్టీయూ



మీడియాతో మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

పూతలపట్టు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టెట్ నుంచి ఇన్‌సర్వీస్ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్టీయూ నేతలు ముత్తిరేవుల, బండపల్లె, వావిల్ తోట, ఎర్రచెరువు పల్లె, కొత్తకోట, తలుపులపల్లె తదితర పాఠశాలలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. వారు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 36ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కమిటీ కన్వీనర్ దేవరాజులు రెడ్డి, నాయకులు కిరణ్, చంద్రన్, జగదీశ్వర పిళ్లై, సుబ్రమణ్యం పిళ్లై తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండండి

బంగారుపాళ్యం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని.. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి లోహిత్ మంగళవారం తెలిపారు. రోప్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తుంబకుప్పం పీహెచ్‌సీలో ప్రతినెలా మొదటి మంగళవారం నిర్వహించే ఆశా డే కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లతో సమావేశం జరిగింది. రోప్స్ సంస్థ డైరెక్టర్, మేనేజర్ ధనశేఖర్, పాల్‌రాజ్, వైద్య సిబ్బంది నాగమణి, రమేష్‌బాబు, అముద, కృష్ణ, శరత్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలను చైతన్య పరచండి



గుడిపాల పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డాక్టర్ జోయా ఆలి రిజ్వి

గుడిపాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రాలు ప్రవేశ పెట్టే పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరచాలని జాతీయ ఆరోగ్య మిషన్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ జోయా ఆలి రిజ్వి అన్నారు. మంగళవారం గుడిపాల పీహెచ్‌సీని జూనియర్ కన్సల్టెంట్ డీఈ అర్పిత, హరికృష్ణ, రీసెర్చ్ కోఆర్డినేటర్ పార్వతి, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ సీవీఎస్ రాయుడు, డాక్టర్ రామచంద్రరావులతో కలిసి తనిఖీ చేశారు. రోగులతో డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఎలా వ్యవహరిస్తారని ఆరా తీశారు. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలకు ఉన్న ఇబ్బందులను తెలుసుకున్నారు. రాష్ట్ర అధికారులు సతీష్‌కుమార్, ఎల్‌బీవీఎహెచ్.దేవి, నిర్మలాగ్లోరి, సుబ్రహ్మణ్యం, గుడిపాల డాక్టర్ సంధ్య, సీహెచ్‌వో సూర్యనారాయణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అది సాయికుమార్ మృతదేహం



సాయికుమార్ (ఫైల్ ఫొటో)

గంగాధరనెల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నీవానది ఏటి ప్రాంతంలో కనిపించిన మృతదేహాన్ని కొట్రకోన పంచాయతీ గారంపల్లె గ్రామానికి చెందిన చిన్నబ్బగౌడ్ కుమారుడు సాయికుమార్(24)గా గుర్తించారు. ట్రాక్టర్‌కు ఇసుకనింపడానికి కూలీగా వెళ్లే ఇతను గతనెల 27వతేదీ నుంచి కనిపించడం లేదు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. మంగళవారం గంగాధరనెల్లూరు బ్రిడ్జికి సమీపంలో నీవానది ఏటి ప్రాంతంలో పిచ్చి మొక్కలవద్ద మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెలికితీసి విచారించగా సాయికుమార్‌గా తేలింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇతడికి ఫిట్స్ వస్తుంటాయని.. రోజూ ఏటి ప్రాంతానికి బహిర్భూమికి వెళుతుంటాడని ప్రమాదవశాత్తూ ప్రవాహంలో పడిపోయి ఊపిరాడక మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. హెడ్‌కానిస్టేబుల్ వెంకటాచలం కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్వదేశీ వస్తువులనే వాడాలి: బీజేపీ



పూతలపట్టులో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

పూతలపట్టు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులను వాడాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆట్లూరి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం పూతలపట్టులో ప్రవాసీ యువజన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ప్రసన్న, ప్రసాద్, సోమశేఖర చౌదరి, భాస్కర్, బాలకృష్ణ, లక్ష్మీపతి కమలాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని మణిపురంలో జరిగిన కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు ఆర్.వెంకటేష్, నాయకులు సుధాకర్, పీకే.చౌదరి, మురుగదాస్,శ్రీనివాసులు, వాసునాయుడు, అన్నాదొరై పాల్గొన్నారు.

గుడిపాల: మండలంలోని కందగిరి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు రమాదేవి, నాయకులు కుమార్, బండిసోమనాథ్, చిట్టిబాబు, చంద్ర, దేవా, శేఖర్, సుబాష్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: నల్లరాళ్లపల్లె వద్ద జరిగిన కార్యక్రమంలో జిల్లా బీజేపీ మైనారిటీ అధ్యక్షుడు రెహమాన్, నేతలు ఈశ్వరకుమార్, మురళి, భాగ్యలక్ష్మి, ఆనందరెడ్డి, నారాయణాచారి, గోవిందరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, శరవణకుమార్, రంజిత్‌కుమార్, ప్రవీణ్, దేవి, అంజలి, నటరాజ్, పుష్పరాజ్ పాల్గొన్నారు.

చెకుముకి పోటీలు



జ్ఞాపికను ఆవిష్కరించిన గురజాల చెన్నకేశవులు నాయుడు

చిత్తూరు సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీఎస్ కన్నన్ ప్రభుత్వ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు మంగళవారం నిర్వహించారు. నగర పరిధిలో వరదప్పనాయుడు పాఠశా, పీఎన్‌సీ కార్పొరేషన్ పాఠశాల, రూరల్ పరిధిలో దొడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, తుమ్మింద జిల్లా పరిషత్ పాఠశాలలు ప్రథమ, ద్వితీయ బహుముతులు సాధించారు. వీరికి ముఖ్య అతిథిగా హాజరైన జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఛైర్మన్ గురజాల చెన్నకేశవులు నాయుడు బహుమతులు ప్రదానం చేశారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు అరుణ శివ ప్రసాద్, ఉపాధ్యక్షురాలు జయంతి, ఎంఈవోలు సెల్వరాజ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగానూ పలు పాఠశాలల్లోనూ చెకుముకి పోటీలు నిర్వహించారు.

జేఈఈ, నీట్ పరీక్షలకు మెటీరియల్ పంపిణీ



యాదమరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్ ప్రభుత్వ ఇంటర్మీడియట్ బాలికా విద్యార్థులకు జేఈఈ, నీట్ పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను ప్రిన్సిపాల్ లలిత ఉచితంగా పంపిణీ చేశారు. పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకాచారి, అధ్యాపకులు దామోదర్ రెడ్డి, మధుసూదన్, మహేష్, సుధాకర్, రాజేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే వ్యర్థాల డంపింగ్



యాదమరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కనే వ్యర్థాలను తరచూ డంపింగ్ చేస్తుండటంతో స్థానికులు దుర్గంధం భరించలేకున్నారు. మండలానికి చెందిన ఒక వ్యక్తి చిత్తూరులోని సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ ఏజెన్సీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మల వ్యర్థాలను మానవ సంచారం లేని ప్రాంతంలో పారబోయాలనే నిబంధన ఉన్నా పాటించడం లేదు. తరచూ చిత్తూరు - గుడియాత్తం రహదారి పక్కనే పూలకండ్రిగ, కమ్మరాయని మిట్ట ప్రాంతాల్లో పారబోస్తున్నాడు. దీంతో సమీప ప్రాంతాల ప్రజలు, రైతులు, ఈ మార్గంలో ప్రయాణించేవారు దుర్గంధం భరించలేకున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరలోనే లబ్ధిదారులకు టిడ్కో గృహాల అప్పగింత

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



మేయర్, చుడాఛైర్‌పర్సన్‌తో కలిసి సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న జగన్మోహన్

చిత్తూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే లబ్ధిదారులకు టిడ్కో గృహాలను అప్పగిస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. మంగళవారం నగర శివారులో ఉన్న టిడ్కో గృహాలను పరిశీలించారు. ఎన్ని గృహాలు పూర్తయ్యాయి.. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో తెలుసుకున్నారు. మూడు బ్లాకుల పరిధిలో సిద్ధం చేసిన 528 గృహాలను లబ్ధిదారులకు ఇవ్వడానికి సిద్ధం చేసినట్లు అధికారులు ఎమ్మెల్యేకు చెప్పారు. మూడు రోజుల్లో అప్రోచ్‌రోడ్డు పనులను పూర్తి చేసి వీధి దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. స్థానికుల కోరిక మేరకు నీటి సమస్యను తీరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, టిడ్కో ఈఈ దేవిక, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు. కాగా, పుత్తూరు రోడ్డు- సాంబయ్యకండ్రిగ వరకు రూ.20లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ఎమ్మెల్యే మంగళవారం రాత్రి ప్రారంభించారు. మేయర్, చుడా ఛైర్‌పర్సన్ తదితరులు పాల్గొన్నారు.

శకుంతలా దేవికి నివాళి

యాదమరి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): 'హ్యూమన్ కంప్యూటర్' శకుంతలా దేవి జయంతి సందర్భంగా మంగళవారం కె.గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు కనకాచారి, హెచ్‌ఎం హిమబిందు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.